సాక్షి కర్నూలు

శనివారం ౹ 7 ౹ సెప్టెంబర్ ౹ 2024



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. అలాగే అంకాళమ్మ అమ్మవారికి విశేష పూజలు చేశారు.



పంటల బీమాకు మార్గదర్శకాలు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఉచిత పంటల బీమా అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 23 పంటలను నోటిఫై చేశారు.

IIలో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,632
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 32,347
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 32,047

న్యూస్‌రీల్

20 మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో తేమ అరని విధంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 20 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా కల్లూరులో 25.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కర్నూలు అర్బన్‌లో 22.4, కర్నూలు రూరల్‌లో 21.8, గూడూరులో 13.2, ఓర్వకల్‌లో9, నందవరంలో 8.6, కౌతాలంలో 8.4, సి.బెలగల్‌లో 7.8 మిమీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా సగటున 6.1 మి.మీ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా ఆరు రోజుల్లో 41.5 మి.మీ వర్షాలు కురిశాయి. భూముల్లో తేమ ఎక్కువ కావడంతో పంటలు పచ్చగా ఉన్నప్పటికీ గింజలు, కాయల వృద్ధిపై ప్రభావం చూపుతోంది.

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

- కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): నిత్యావసర ధరలను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక వ్యాపారులు ఇష్టానుసారంగా రేట్లను పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. బియ్యం, బ్యాళ్లు, నూనె, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశన్నంటుతున్నాయన్నారు. ధరల నియంత్రణకు చౌకదుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ.. పెట్రో ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నాయకులు మునెప్ప, నబీ రసూల్, జి.చంద్రశేఖర్, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలు, సర్వేయర్లకు బదిలీల కౌన్సెలింగ్

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వీఆర్వోలు, సర్వేయర్లకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వీఆర్వోలకు కలెక్టరేట్ ఏఓ పి.రాజేశ్వరి, సర్వేయర్లకు కర్నూలు సర్వే ఏడీ మునికన్నన్, నంద్యాల, అనంతపురం ఇన్‌చార్జి సర్వే ఏడీ రూప్లానాయక్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ చేపట్టారు. వీఆర్వోలకు సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 140 మంది కౌన్సెలింగ్‌కు హాజరై ఆప్షన్‌లు ఇచ్చుకున్నారు. సర్వేయర్లకు సంబంధించి మొత్తం 291మందికి గాను 22 మంది గైర్హాజరయ్యారు. వీరికి జాయింట్ కలెక్టర్, కలెక్టర్ అనుమతితో త్వరలోనే స్థానాలను కేటాయిస్తారు.

10న పారామెడికల్ కోర్సులకు రెండో విడత కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): పారామెడికల్ కోర్సులకు రెండో విడత కౌన్సెలింగ్ ఈ నెల 10న నిర్వహించనున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కళాశాలలోని ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందన్నారు. వివిధ కోర్సుల్లో మిగిలిన డీఎంఎల్‌టీ-14, డీఏఎన్ఎస్-5, డీఎంఐటీ-4, డీఆర్‌జీఏ-3, డీవోఏ-2, డి.డయాలసిస్-6, డి.డార్క్‌రూమ్ అసిస్టెంట్-6, ఈసీజీ-3, క్యాథలాబ్-3, డి. కార్డియాలజి టెక్నీషియన్ -3 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని.. ఈ సీట్లను మెరిట్, రోస్టర్ ఆధారంగా భర్తీ చేస్తామన్నారు.

9 నుంచి లాయర్ల ఎన్‌రోల్‌మెంట్

కర్నూలు (లీగల్): సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తగ్గింపు రుసుంతో ఈనెల 9వ తేదీ నుంచి న్యాయవాదుల నమోదు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తగ్గించిన రుసుం రూ.1,250, ఎస్సీ, ఎస్టీలు రూ.625ను రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు చెల్లించాలని, దరఖాస్తు ఫారాలను బార్ కౌన్సిల్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తును రుసుం చెల్లింపు చలాన్లతో పాటు సోమ, మంగళవారాలలో అమరావతిలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఏకదంతాయ.. గుణాధీశాయ!



- నేడు వినాయక చవితి
- ఉమ్మడి జిల్లాలో కొలువుదీరనున్న 12 వేల విగ్రహాలు
- 15న కర్నూలులో, 11న నంద్యాలలో గణనాథుని శోభాయాత్ర
- కర్నూలులో వినాయక ఘాట్‌లో, నంద్యాలలో చిన్నచెరువుకట్టలో నిమజ్జనోత్సవం



కర్నూలు: కొలువుదీరేందుకు వెళ్తున్న భారీ వినాయకుడు

కర్నూలు కల్చరల్: ఆది దేవుడు.. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు.. సర్వదేవతులు కొలువైన పార్వతీ తనయుడు వినాయకుని పూజకు వేళైంది. లంబోదరున్ని భక్తి శ్రద్ధలతో పూజించి నిండు దీవెనెలు అందుకునేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేడు (శనివారం) వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. గ్రామ గ్రామానా.. వీధి వీధినా .. వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలు ఉత్సాహంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వినాయక మండపాలు.. మిరుమిట్లు గొలిపే లైటింగ్.. చిన్నాపెద్ద అన్న తేడా లేకుండా అందరూ కలిసి సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విగ్రహాల ఏర్పాటుకు మండపాలు సిద్ధం అయ్యాయి. కర్నూలు నగరంలో నిర్వహించే వినాయక చవితి వేడుకలకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రస్తుతం 44వ సంవత్సరం వేడుకల నిర్వహణకు అందరూ ఉత్సాహంగా ఉన్నారు. కర్నూలు నగరంలో రెండు విగ్రహాలతో ప్రారంభమైన గణేశ్ ఉత్సవాల ప్రస్థానం ఇప్పుడు 2,500 విగ్రహాలకు చేరుకుంది. ఇందులో 45 శాతం వరకు మట్టి వినాయక విగ్రహాలు ఏర్పాటు కానున్నట్లు ఉత్సవ సమితి ప్రతినిధులు చెబుతున్నారు. దీంతో పాటు కర్నూలు ఓల్డ్‌సిటీలో తుంగభద్రా నది తీరంలో రాష్ట్రంలోనే రెండో అత్యంత ఎత్తయిన 63 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఎకో ఫ్రెండ్లీ వినాయక చవితి వేడుకలు జరుపుకొని ఆదర్శంగా నిలవనున్నారు. కర్నూలు నగరంతో పాటు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, నందికొట్కూరు పట్టణాలు, పత్తికొండ, బనగానపల్లె, ఆత్మకూరు, పాణ్యం, ఆళ్లగడ్డ ప్రాంతాలతో సహా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 12 వేలకు పైగా విగ్రహాలు పూజలు అందుకోనున్నాయి. వినాయక చవితి అంటేనే సామూహికంగా సమైక్యతతో నిర్వహించుకునే పర్వదినం. నంద్యాలలో గణనాథున్ని ఐదో రోజు చిన్న చెరువుకట్టలో, కర్నూలు నగరంలో తొమ్మిదో రోజు వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ సమితి ప్రతినిధులు వెల్లడించారు.

మట్టి వినాయకులను పూజిద్దాం..

శుక్లాం భరధరం అంటూ హిందువులు తాము నిర్వహించే ప్రతి శుభకార్యానికి ముందు గణపతిని పూజ చేస్తారు. పంచ భూతాల్లో ఒక్కటైన మట్టితో చేసిన వినాయకున్ని పూజించడంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నది పండితుల మాట. వివిధ రకాల ఆకులు, పుష్పాల సువాసనల నుంచి మిశ్రమ వాయువులను పీల్చడం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు దూరం కావడంతో పాటు మెదడు ఉత్తేజితవుతోందని చెబుతున్నారు. ప్రకృతి సిద్ధమైన మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పూజించడం తిరిగి వాటిని నీటిలో నిమజ్జనం చేయడంతో అవి నీటిలో సులువుగా కరిగి పంట పొలాలకు చేరడంతో భూములు సారవంతమవుతాయి.



కర్నూలు పెద్ద మార్కెట్‌లో మట్టివినాయకుల కొనుగోలు



వినాయకున్ని, పూజా సామగ్రి తీసుకెళ్తున్న దృశ్యం



విక్రయానికి సిద్ధంగా ఉంచిన అలంకరణ సామగ్రి



కర్నూలు సీక్యాంప్ సెంటర్ గణపతి ఆలయంలో కొలువుదీరిన వినాయకుడు



కోడుమూరులో వినాయకుడిని తీసుకెళ్తున్న ప్రజలు

కర్నూలులో మట్టి 'ఘన'పతి

- 63 అడుగుల మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని తుంగభద్రా నది తీరంలో ఏర్పాటు చేస్తున్న 63 అడుగుల మట్టి వినాయక విగ్రహం పర్యావరణ పరిరక్షణలో మొదటి స్థానంలో నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. తుంగభద్రా నది తీరంలో శ్రీ లక్ష్మీ నారసింహ స్వామి వినాయక భక్త బృందం ఏర్పాటు చేసిన 63 అడుగుల మట్టి వినాయ విగ్రహం వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలు నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. కల్యాణ్ మిత్ర బృంద సభ్యులు ఐదు సంవత్సరాల నుంచి భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. 2018లో మొదటి సంవత్సరం 55, 2019లో 65, 2022లో 60, 2023లో 56 అడుగులు ఈ ఏడాది 63 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ ఏడాది ఏర్పాటు చేసిన విగ్రహం రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద మట్టి వినాయక విగ్రహం అన్నారు. భక్త బృందాన్ని అందరూ ఆదర్శంగా తీసుకొని మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలన్నారు. కోల్‌కతాకు చెందిన శిల్ప కళాకారులు 15 మంది రెండు నెలలు శ్రమించి విగ్రహాన్ని తయారు చేశారన్నారు. బంక మట్టి, వెదురు కర్రలు, వరి గడ్డి, కాటన్ క్లాత్, వాటర్ కలర్స్‌తో విగ్రహం రూపు దిద్దుకుందన్నారు. విగ్రహం ఏర్పాటుకు సుమారు రూ.35 లక్షల వ్యయం అవుతుందన్నారు. నగర ప్రజలు ఇలాంటి వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. శనివారం నుంచి 10 రోజుల పాటు పూజలు నిర్వహించి 11వ రోజు ఈనెల 17వతేదీ సాయంత్రం విగ్రహం ప్రతిష్టించిన చోటే నిమజ్జనం చేస్తామన్నారు. సమావేశంలో భక్త బృందం వ్యవస్థాపకులు కల్యాణ్ కుమార్, సభ్యులు అశోక్, భరత్, సతీష్, ఆనంద్, చింటు, మహేష్‌కుమార్, నాగరాజు, ఉమన్న, శ్రీనివాసరెడ్డి, రాజ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం.. కావాలి అభిమతం



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలని ఏపీ కాలుష్యనియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరు బీవై మునిప్రసాదు సూచించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన 1500 వినాయకులను శుక్రవారం సీక్యాంపులో ప్రజలకు ఉచితంగా ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయకుల తయారీలో మట్టి, సహజసిద్ధమైన రంగులు, పత్తి, నారలను వినియోగించుకోవాలని సూచించారు. విగ్రహాల దగ్గర లౌడ్ స్పీకర్లను వినియోగించొద్దని, ధ్వని కాలుష్యాన్ని అరికట్టాలన్నారు. అనంతరం మట్టి వినాయకులను పూజించడంతో కలిగే లాభాలను వివరిస్తూ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మట్టి వినాయకులతో కలిగే ప్రయోజనాలపై ఇందిరాగాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాస రచనపోటీలు నిర్వహించి బహుమతులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎనలిస్టు గణేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం పంచలింగాల గ్రామంలోని జిల్లా జైలు, మహిళా జైలును సందర్శించారు. జైలు అధికారులను అడిగి ఖైదీల వివరాలను తెలుసుకున్నారు. వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. జైలు పర్యవేక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి దిగుబడి!

- అధిక వర్షాలతో నష్టపోయిన మొక్కజొన్న రైతులు
- ఇప్పటికే 28 వేల ఎకరాల్లో పంట నష్టం
- తేమ ఎక్కువైతే వేర్లు కుళ్లి పోయే ప్రమాదం



నీట మునిగి మొక్కజొన్న (ఇన్‌సెట్) గింజలులేని కంకులు

కర్నూలు(అగ్రికల్చర్): రెక్కల కష్టం నీటిపాలైంది.. రైతుకు కన్నీటి దిగుబడే మిగిలింది. వారం రోజులకుపైగా కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతినింది. కర్నూలు జిల్లాలో కల్లూరు, కర్నూలు, సి.బెళగల్, కోడుమూరు, వెల్దుర్తి, ఓర్వకల్లు, నంద్యాల జిల్లాలో నందికొట్కూరు, ఆత్మకూరు, పగిడ్యాల, మిడుతూరు, జూపాడు బంగ్లా, పాములపాడు, వెలుగోడు తదితర మండలాల్లో రైతులు ఎక్కువగా మొక్కజొన్న సాగు చేశారు. విత్తనం వేసినప్పటికి నుంచి అప్పుడప్పుడు వానలు కురవడంతో పైరు బాగా పెరగింది. దిగుబడికి ఢోకా లేదని భావిస్తున్న తరుణంలో ముసురు రైతులను నిండా ముంచింది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారమే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 28 వేల ఎకరాల్లో పంట దెబ్బతినింది. పొలాల్లో నీళ్లు నిలువడంతో వేర్లు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. రోజు, రోజుకు నష్టం పెరుగుతోంది. మొక్కజొన్నలో రెండు రోజులకు మించి నీరు నిలిస్తే నష్టం తీవ్రత ఎక్కువగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

ఖాళీ కంకులే కనిపిస్తున్నాయ్...

ప్రస్తుతం మొక్కజొన్న కంకిలో విత్తనం వృద్ధి చెందే సమయం (సీడ్ సెట్టింగ్). ఈ సమయంలో వర్షాలు పడుతుండటంతో కంకిపై పట్టిన పూత (నూగు) కారి పోతోంది. దీంతో విత్తనం అభివృద్ధి చెందడం లేదు. మొక్కజొన్నలో ఎకరాకు పెట్టుబడి సగటున రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టారు. దిగుబడి ఎకరాకు 40 క్వింటాళ్ల వరకు వస్తుంది. అధిక వర్షాలతో ఎకరా మొక్కజొన్నలో 25 శాతం వరకు ఖాళీ కంకులు ఉంటున్నాయి. మరో 25 శాతం కంకుల్లో సగానికిపైగా కంకి ఖాళీగా ఉంటోంది. మిగిలిన 50 శాతంలో కూడా 100 శాతం కంకిలో గింజలు లేవు. కంకులను చూసి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్నలో గింజలు లేకపోవడంతో విత్తనాల నాణ్యతపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మేం ఆరు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాం. పెట్టుబడి రూ.1.50 లక్షల వరకు పెట్టాం.గత నెల 30 నుంచి తేమ ఆరకుండా వర్షాలు కురుస్తుండటంతో పంట కుళ్లి పోతోంది. కంకిపై వచ్చిన నూగు(సుంకు) రాలిపోతోంది. కంకులు గింజలు లేకుండా ఖాళీగా వస్తున్నాయి. మొక్కజొన్న రైతులకు వర్షాలు తీరని నష్టాన్ని కలిగించాయి. ప్రభుత్వం చొరువ తీసుకొని అధిక వర్షాలతో నష్టపోయిన మొక్కజొన్న రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– ఖాజామియా, దామగట్ల, నందికొట్కూరు మండలం

నిలిచిన నీటిని తీసివేయాలి



మొక్కజొన్న పంట 50 నుంచి 90 రోజుల దశలో ఉంది. గింజ ఏర్పడే దశలో ఉన్న పంటకు నష్టం ఎక్కువగా ఉంది. శాఖీయ, పూత దశలలో ఉంటే తగిన చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే తీసి వేయాలి. నిలిచిన నీటిని తీసివేసిన తర్వాత పంటపై 2 శాతం యూరియా(హెక్టారుకు 10 కిలోలు) లేదా 1 శాతం పొటాషియం నైట్రేటు (హెక్టారుకు ఐదు కిలోలు)పిచికారీ చేస్తే త్వరగా కోలుకుంటుంది. నీటి ముంపు, వాతావరణంలో అధిక తేమ కారణంగా వ్యాధులు (కాండం/వేరు తెగులు, గింజబూజు తెగులు) రావడానికి అవకాశం ఉంది. కార్బెండజిమ్ 2–3 గ్రాములు లేదా మెటాలాక్సిల్ 35 శాతం డబ్ల్యూఎస్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– సుజాతమ్మ, ప్రధాన శాస్త్రవేత్త, ఏరువాక కేంద్రం, కర్నూలు

సోదరభావంతో మెలగాలి



ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: వినాయక చవితి ఉత్సవాలను సోదరభావంతో జరుపుకోవాలని ఎస్పీ బిందు మాధవ్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసి జిల్లా ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలతో పాటు నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వాహనాలను మండపాలకు దూరంగా నిలిపేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, ప్రార్థనా మందిరాలు, ఆసుపత్రులకు ఇబ్బంది కలిగేలా లౌడ్ స్పీకర్లు పెట్టరాదన్నారు. రాత్రి 10 గంటల తర్వాత స్పీకర్లు, మైకులను నిలిపివేయాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తితే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ పేర్కొన్నారు.

శ్రీశైల ఆలయానికి బంగారు పూలు విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానానికి శుక్రవారం కర్నూలుకు చెందిన బి.సి.శివకుమార్ 108 బంగారు పూలను విరాళంగా సమర్పించారు. విరాళంగా సమర్పించిన బంగారు పూలు 19 గ్రాముల బరువు ఉంటాయని దాత తెలిపారు. ఆయనను వేదాశీర్వచనంతో స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.



సూక్ష్మంలో మోక్షం

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాలకు చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ అగ్గిపెట్టెపై 60 సూక్ష్మ వినాయకుల చిత్రాలను గీచి అబ్బుర పరిచారు. రెండు అంగులాల పొడవు, రెండున్నర అంగులాల వెడల్పు గల అగ్గిపెట్టెపై మైక్రో బ్రష్‌తో 2 గంటల వ్యవధిలో గణనాథుల చిత్రాలను వేశారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా వినాయక చవితి సందర్భంగా స్వామి చిత్రాలను వేస్తున్నానన్నారు. చిత్రంలో త్రిముఖ గణపతి, నాట్య గణపతి, శంఖులో గణపతి, ఓం ఆకారంలో గణనాథుడు, కాణిపాకం గణనాథుల చిత్రాలు వేశానన్నారు. – నంద్యాల(అర్బన్)

పంటల బీమా అమలుకు మార్గదర్శకాలు

ఉమ్మడి జిల్లాలో 22 పంటలు నోటిఫై

- గ్రామం యూనిట్‌గా వరికి బీమా
- వాతావరణ బీమా కింద పత్తి, వేరుశనగ ఎంపిక



కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. నోటిఫై చేసిన పంటలు ఈ–పంటలో నమోదు చేసుకొని ఈ–కేవైసీ చేయించుకుంటే ఉచిత పంటల బీమా వర్తిస్తుంది. పంట కోత ప్రయోగాల ఆధారంగా పరిహారం లభిస్తుంది.

- వరికి హెక్టారుకు రూ.లక్షకు బీమా చేస్తారు.
- వాతావరణ ఆధారిత బీమా కింద ఉమ్మడి జిల్లాలో పత్తి, వేరుశనగలను నోటిఫై చేసింది.
- వాతావరణ బీమా అమలుకు రిస్క్ పీరియడ్ వేరుశనగ పంటకు జూలై 16 నుంచి అక్టోబర్ 31 వరకు, పత్తిలో జూలై 1 నుంచి నవంబర్ 30 వరకు ఉంటుంది. ఈ మధ్యలో కురిసే అధిక వర్షాలు, వర్షాభావం, చీడపీడలు ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొని బీమా అమలు చేస్తారు.
- పత్తికి హెక్టారుకు రూ.లక్ష, వేరుశనగకు రూ.70 వేలకు బీమా చేస్తారు.
- రైతుల వాటా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అప్పుడే రైతులకు బీమా మొత్తం అందనుంది.


2023 ఖరీఫ్ పంటల బీమా పరిహారం ఇంతవరకు అందలేదు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం రైతుల వాటా ప్రీమియాన్ని చెల్లించే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయింది. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం దీన్ని విస్మరించడంతో రైతులకు అన్యాయం జరుగుతోంది.

కర్నూలు జిల్లాలో బీమా అమలు ఇలా..

గ్రామం యూనిట్: వరి.
మండలం యూనిట్: కంది, ఎండుమిర్చి, జొన్న, ఆముదం.
జిల్లా యూనిట్: కొర్ర, సజ్జ, ఉల్లి.

నంద్యాల జిల్లాలో బీమా అమలు ఇలా..

గ్రామం యూనిట్: వరి.
మండలం యూనిట్: మొక్కజొన్న, కంది, మినుము, ఎండుమిర్చి.
జిల్లా యూనిట్: జొన్న, సజ్జ, కొర్ర, ఆముదం.



పారుతున్న 'అందాలు'

చుట్టూ ఎత్తయిన కొండలు.. పరుచుకున్న పచ్చదనం.. ఆ మధ్య నుంచి తెల్లని జలపాతం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తుంది. ఒక మోస్తరు వర్షం కురిసిందంటే చాలు.. కర్నూలు–నంద్యాల రహదారిలో తమ్మరాజుపల్లె ఘాట్ వద్ద ఈ దృశ్యం ఆవిష్కృతమవుతుంది. చూపు తిప్పుకోనివ్వని ఈ జలపాతాన్ని చేరుకోవడం కూడా కష్టమే. ఒకప్పుడు ఆ ప్రాంతంలో ఒక అగ్రహారం ఉండేదని, అయితే సరైన సౌకర్యాలు లేకపోవడంతో స్థానికులు అక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోయినట్లుగా తెలుస్తోంది. ఎత్తయిన కొండపైనున్న బండ పరుపు మీదుగా గద్దెల దేరిగా పిలువబడే ఈ జలపాతం పరవళ్లు తొక్కుతూ సమీపంలోని కొచ్చెరువులో కలుస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ప్రతి స్కూల్‌ను ఎంఈఓలు తనిఖీ చేయాలి

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులు కచ్చితంగా ప్రతి స్కూల్‌ను తనిఖీలు చేయాలని ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ డైరెక్టర్, జిల్లా పరిశీలకులు నరసింహారావు సూచించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలు, సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూడైస్‌లో వివరాలను నమోదు చేసే సమయంలో ఎక్కడా చిన్నపొరపాటు జరుగకూడదని, ప్రధానంగా పుట్టిన రోజు తేదీలు పక్కగా నమోదు చేయాలన్నారు. ప్రతి రోజు ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు సకాలంలో వేసేలా చర్యలు తీసుకోవాలని, చాలా స్కూళ్లలో సాయంత్రం నిర్దేశించిన సమయం కంటే ముందుగానే వెళ్లుతున్నారని, దీనిపై డీఈఓ, డిప్యూటీ, ఎంఈఓలు పరిశీలించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేటు స్కూళ్లు ఉండరాదన్నారు. సమావేశం ఇకపై ప్రతి నెలా ఉంటుందని, జిల్లా స్థాయిలో సైతం రెగ్యులర్‌గా సమీక్షలు చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో కర్నూలు డీఈఓ కాగిత శామ్యూల్, నంద్యాల డీఈఓ సుధాకర్ రెడ్డి, ఏడీలు, డిప్యూటీ డీఈఓలు, తదితరులు పాల్గొన్నారు.




సమీక్షకుహాజరైన విద్యాశాఖ అధికారులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న నరసింహారావు

తరగతి గదిలోకి కుక్క.. విద్యార్థినిపై దాడి

కర్నూలు సిటీ: నగరంలోని బీ–క్యాంపు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థినిపై కుక్క దాడి చేసింది. శుక్రవారం తరగతి ముగిసిన తరువాత విద్యార్థులు బయటకు వస్తున్న సమయంలో హెచ్‌ఎం గది దగ్గర ఉన్న కుక్క 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సంతోషి కాలును కరిచింది. స్కూల్‌కి కాంపౌండ్ వాల్‌తో పాటు, తరగతి గదులకు గ్రిల్ కూడా ఉంది. అయినా కూడా కుక్క లోపలికి వచ్చి విద్యార్థినిని కరవడంపై తల్లిదండ్రులు హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కకాటుకి గురైన విద్యార్థిని ఆసుపత్రికి తీసుకెళ్లకుండా జాప్యం చేయడంతో విద్యార్థిని తండ్రి తిరుపాల్ పాఠశాల సిబ్బందిని నిలదీశారు. అనంతరం విషయం డిప్యూటీ డీఈఓ హనుమంతరావుకు ఫోన్ చేసి తండ్రి ఫిర్యాదుగా చేయగా, తను విచారించి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం కుక్కకాటుకు గురైన విద్యార్థినిని ఆసుపత్రికి తీసుకపోయి చికిత్స చేయించారు.



కుక్కకాటుకు గురైన విద్యార్థిని

మహిళ దారుణహత్య

నందికొట్కూరు: పట్టణంలోని మారుతీనగర్ లో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఘటన స్థలాన్ని డీఎస్పీ రామాంజినాయక్, రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ సురేష్‌బాబు శుక్రవారం ఉదయం పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మారుతీనగర్‌కు చెందిన పింజరి శాలుబీ (41) ఒంటరిగా జీవిస్తోంది. గురువారం అర్ధరాత్రి కొందరు యువకులు ఆమెను హత్య చేసినట్లు తెలుస్తోంది. 2015లో పట్టణానికి చెందిన గంజేంద్ర అనే వ్యక్తి హత్య కేసులో శాలుబీ నిందితురాలు. ఈ క్రమంలో గజేంద్ర కుమారుడు చందు కొందరు యువకులతో కలసి ఈ హత్యకు పాల్పడి ఉంటాడనే అనుమానం వ్యక్తమవుతోంది. చందు పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. హతురాలి కుమారుడు పింజరి మౌలాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన కర్నూలు సిటీ ప్లానర్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో సిటీ ప్లానర్‌గా ప్రదీప్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతవారం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఆయన్ను టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

డీఆర్‌డీఏ బదిలీల్లో రాజకీయ జోక్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) బదిలీల్లో రాజకీయ జోక్యం పెరిగిపోయింది. కోరుకున్న చోటుకు బదిలీ అయ్యేందుకు సిబ్బంది రాజకీయ పార్టీల నేతల సిఫారస్సు లేఖలు తేవడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది. బదిలీల గడువును ఈ నెల 15 వరకు పొడిగించడంతో రాజకీయ జోక్యం మరింత పెరిగింది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీలు చేపట్టనున్నారు. ఒకేచోట ఐదేళ్ల పైబడి పనిచేస్తున్న వారు విధిగా బదిలీ కావాల్సి ఉంది. ఈ కోవలోని ఉద్యోగులు ఉమ్మడి జిల్లాలో 79 మంది ఉన్నారు. మరో 66 మంది రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. సెప్టెంబర్ 15న బదిలీ ఉత్తర్వులు జారీ చేయనుండగా.. 16న కొత్త పోస్టుల్లో చేరేలా చర్యలు తీసుకున్నారు.

కర్నూలులో పేకాటరాయుళ్ల అరెస్ట్

కర్నూలు: కర్నూలు బంగారుపేటలోని కేసీ కెనాల్ పక్కన కంప చెట్లలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో రెండవ పట్టణ సీఐ జి.వి.నాగరాజురావు తన సిబ్బందితో దాడి చేసి 14 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం సాయంత్రం పక్కా సమాచారం మేరకు కేసీ కెనాల్ గట్టుపైన తనిఖీ నిర్వహించి ముళ్లపొదల మాటున పేకాట ఆడుతున్న బూడిదపాడు గ్రామానికి చెందిన ఈడిగ శ్రీధర్, బోయ హనుమంతు, గుర్రం సురేందర్‌రెడ్డి, మాచాపురం గ్రామానికి చెందిన వడ్డె వీరేష్, కర్నూలు ఎ.క్యాంప్‌కు చెందిన గురుప్రకాష్, సీక్యాంప్‌కు చెందిన షేక్ ఫయాజ్ బాషా, ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన షేక్ అఫ్జల్ బాషా, దిన్నెదేవరపాడుకు చెందిన బోయ శ్రీనివాసులు, చిదంబరరావు వీధికి చెందిన కుమ్మరి శేఖర్, ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన నల్లబోతుల రవిశంకర్, కల్లూరుకు చెందిన షేక్ అబ్దుల్లా, ప్రకాష్‌నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్లా, ఉప్పరి ఈరన్న, వనపర్తి జిల్లా పెబ్బేరుకు చెందిన పోనప్ప, బంగారుపేటకు చెందిన నీలిషకారి అంజనేయులును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి రూ.1.60 లక్షల నగదుతో పాటు 14 సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

బనగానపల్లెలో పట్టపగలు దోపిడీ

- వృద్ధురాలిపై దాడి చేసి బంగారు ఆభరణాలు అపహరణ



బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శుక్రవారం పట్టపగలు గుర్తు తెలియని దుండగుడు దోపిడీకి పాల్పడ్డాడు. వృద్ధురాలిపై దాడి చేసి బంగారు ఆభరణాలు అపహరించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక సప్తగిరి లాడ్జీ యజమానురాలు ఎర్రగొల్ల పార్వతమ్మ అక్కడే ఒంటరిగా నివాసం ఉంటోంది. శుక్రవారం ఉదయం ముఖానికి హెల్మెట్ ధరించిన గుర్తు తెలియని దుండగుడు అకస్మాత్తుగా వృద్ధురాలి వద్దకు వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు అపహరించేందుకు ప్రయత్నించాడు. పార్వతమ్మ ప్రతిఘటించడంతో దుండగుడు తన తలకు పెట్టుకున్న హెల్మెట్‌తో ఆమె తలపై బలంగా కొట్టాడు. దీంతో బాధితురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే దుండగుడు బంగారు గొలుసుతో పాటు ఆమె చేతులకు ఉన్న గాజులు, ముక్కురాళ్లు తీసుకుని అక్కడి నుంచి పారిపోయాడు. కొద్దిసేపటికి తేరుకున్న బాధితురాలు కేకలు వేయడంతో దోపిడీ ఘటన వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణయ్య వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. చోరీకి గురైన బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని బాధితురాలి కుటుంబీకులు తెలిపారు. కాగా దోపీడికి పాల్పడిన దొంగ బైక్‌పై వచ్చి తన పని పూర్తి చేసుకుని వెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అప్పుల భారంతో చోరీకి యత్నం

- సబ్ పోస్టు ఆఫీస్‌లో చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపిస్తున్న సీఐ కృష్ణయ్య

బనగానపల్లె రూరల్: ఓ యువకుడు అప్పుల భారంతో చోరీకి యత్నించి చివరకు పోలీసులకు చిక్కాడు. గత ఈ నెల 25వ తేదీన బనగానపల్లె సబ్ పోస్టాఫీసులో చోరీకి యత్నించిన నిందితుడిని అరెస్టు చేసినట్లు బనగానపల్లె సీఐ కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు వివరాలను మీడియాకు వివరించారు. పట్టణంలోని ఖాజీవాడలో నివాసముంటున్న సయ్యద్‌ముస్తాఫా అలీ మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో కొంత అప్పులు కావడంతో ఒత్తిడి పెరిగింది. బనగానపల్లె సబ్‌పోస్టాఫీస్‌లో సొమ్మును అపహరించి అప్పులు కట్టుకోవాలని పథకం వేశాడు. ఈ మేరకు గత నెల 25వ తేదీన పోస్టాఫీసు వెనుక డోర్ తాళం ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించాడు. అయితే అక్కడ ఎలాంటి డబ్బులు లభించకపోవడంతో నిరాశతో వెనుదిరిగాడు. మరుసటి రోజు తపాలా ఉద్యోగుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి శుక్రవారం స్థానిక జీఎంఆర్ ఫంక్షన్‌హాల్ సమీపంలో అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.